# తొమ్మిది ముళ్ళు

పాత్రలు :

| | |
|---|---|
| జగన్నాథం<br>సావిత్రమ్మ | భార్యాభర్తలు |

ఇందిర : వాళ్ళ అమ్మాయి

నీలకంఠం : వాళ్ళ కుటుంబ శ్రేయోభిలాషి

| | |
|---|---|
| కుటుంబయ్య<br>పార్వతమ్మ | పెళ్ళికొడుకు తల్లిదండ్రులు |

(జగన్నాథం యిల్లు)

నీలకంఠం : (బయటనుంచి) జగన్నాథం బావా! బావా!

సావిత్రమ్మ ; (లోపలినుంచి వస్తూ) ఎవరదీ?

నీల : నేనమ్మా, నీలకంఠాన్ని. బావ ఇంట్లో లేడా?

సావి: లేకేం? రా అన్నయ్యా! రా! ఇంట్లోకి రా!

నీల : (లోపలకు వస్తూ) బావ ఇంటిలో పిల్లల్ని పెడుతున్నాడా?

సావి: అలాగే వుంది ఆయన తీరు చూస్తే. అదిగో వసారాలో పడుకు న్నారు చూడు.

నీల : పడుకున్నాడా? దీపాలవేళ ఇప్పుడు పడకేమిటమ్మా (కంగారుగా) ఒంట్లో బాగాలేదా?

సావి: (దిగులుగా) ఒంట్లో కాదులే అన్నయ్యా! ఇంటిలోనే బాగాలేదు.

జగ : (లేస్తూ) ఎవరూ? నీలకంఠవా? రా! రా. కూర్చో. బొత్తిగా కనపట్టం మానేశావ్.

నీల : ఇందిరకి సంబంధం కుదిరిందటగా? కాస్త నా చెవినవేస్తే నీ నోటి ముత్యాలు రాలిపోతా యనుకున్నావా? అప్పుడే పదిరోజు లయిందటగా కుదిరీ?

జగ : (నిట్టూరుస్తూ) సంబంధం .... కుదరనూ కుదిరింది, చెడనూ చెడింది.

నీల : (కంగారుగా) చెడిందా? చెడటం ఏమిటయ్యా? ఇందిర పెళ్ళని నేను సంబరపడి అడగటానికొస్తే సంబంధం చెడిందంటావేమిటి? అసలు పెళ్ళివాళ్ళెవరు?

జగ : (బాధగా) ఏం చెప్పమంటావ్ బావా? రాజమండ్రినుంచి కుటుం బయ్యగారనీ పెళ్ళాన్నీ, కొడుకునీ తీసుకువచ్చాడు. పిల్లనిచూసు కున్నారు. నచ్చిందంటే నచ్చిందన్నారు.

నీల : ఇందిర నచ్చకపోవటం ఏమిటి? బొమ్మలాంటి పిల్ల.

జగ : పిచ్చిగానీ పిల్ల బొమ్మలావుంటే సరిపోతుందా? కట్నం కావద్దూ? కట్నం. అన్ని మాటలూ జరిగాయి మూడు వేలిస్తానన్నాను. కిందా మీదా పెట్టి మరో వెయ్యి వేసుకోమన్నాను. సరే! కుర్రాడు బి.ఎ. చదివాడు. ఏదో ఉద్యోగం చేస్తున్నాడు. అందానికి కూడా ముచ్చటగా

వున్నాడు. ఇందిరకూడా బాగా యిష్టపడింది. ఇక వెనకాడితే లాభంలేదని అదీ —— ఒప్పుకున్నా. వెండిపళ్లెం, వెండి చెంబూ —— ఆడబిడ్డ కట్నం – ఇవన్నీ వున్నాయనుకో. ఈ నెలాఖరుకి లగ్నంకూడా పెట్టేసుకుందా మనుకున్నాం.

నీల : ఇంకేం? అంతా బాగానేవుంది!

జగ : విను మరీ! ఈ పదిరోజులనుంచీ యింటికి ఎక్కడలేని కళా వచ్చిందనుకో. ఇందిరకి పెళ్ళయిపోతే ఇక భారతి వుంది. దానికీ ఎలాగో అయిపోతుందిగానీ ఆగుతుందా? అని పుట్టెడు బలం తెచ్చుకున్నా బావా! తీరా చూస్తే ఇవ్వాళ మధ్యాహ్నం పెళ్ళివాళ్ళ దగ్గిర్నుంచి పిడుగులాంటి వుత్తరం.

నీల : ఏం రాశారు? సంగతేమిటో చెప్పు. అలా అధైర్య పడిపోకు (ఓదార్చుతూ)

జగ : ఇంకేం ధైర్యం బావా? ఉత్తరం చదివితే నా నడుం విరిగిపోయిందనుకో. ఆ ముక్క చెప్పటానికి నోరురాక వుత్తరం తీసికెళ్ళి ఇందిరకే ఇచ్చేసింది వాళ్ళమ్మ. (కంఠం హెచ్చించి) సావిత్రీ! అమ్మాయి నడిగి వుత్తరం ఇలా తీసుకొస్తావా?

నీల : ఇప్పుడు ఉత్తరం ఎందుకులే. సంగతేవిటో చెప్పు.

జగ : ఇంకా సంగతేమిటయ్యా నా కాష్టం? కట్నం చాలలేదట కట్నం. కాకినాడనుంచి మంచి సంబంధం వచ్చిందట. 6 వేల కట్నం యిచ్చి, అత్తకీ, ఆడబిడ్డలకీ టెర్లిన్ చీరలవీ పెడతామనీ —— కుర్రాడికి వాచీ యిస్తామనీ–ఇంకా ఏవేవో తగలడ్డాయిలే, అవన్నీ మీ రిస్తారా? లేకపోతే మా సంబంధం వదిలేసుకుంటారా? ఎక్కువ వచ్చేచోట కాదని మీ సంబంధం ఎందుకు చేసుకోవాలి? అంటూ లాయరు ప్రశ్నలు వేస్తూ ఉత్తరం రాశాడు పిల్లాడి తండ్రి.

నీల : వాడి పెద్దరికం మండా! వాడికి కూడా బెర్లిన్‌లాగూ కుట్టిస్తారని ఆశపడ్డాడేమో!

సావి : (వుత్తరం తెస్తూ) ఇదిగో వుత్తరం! నువ్వు చదివి చూడన్నాయ్యా! ఇదేమైనా ధర్మంగావుందా? ఆ కాకినాడ వాళ్ళు అంత కొవ్వి వుంటే ఇంకో సంబంధం చూచుకోకూడదూ?

నీల : అదేంటమ్మా? మనం కుదుర్చుకున్నామని వాళ్ళకేం తెలుసు? మన లాగే వాళ్ళకీ పిల్లకి పెళ్ళి చెయ్యాలన్న తాపత్రయమే. పెళ్ళి కావలసిన కుర్రాడున్నాడని తెలిస్తే ఎంతోమంది వస్తారు, పోతారు. ఒకసారి మాట యిచ్చాక ఆ నీతి పెళ్ళికొడుకు తరుపు వాళ్ళకి వుండాలిగానీ....

జగ : అయ్యో! వాళ్ళకెందుకుంటుందయ్యా? డబ్బు చేదా? నీతులూ ధర్మాలూ పనికివచ్చే రోజులా యివి. కాలం మారిపోవటంలేదూ?

నీల : మరి ఇప్పుడేం చేద్దామనుకొంటున్నావు?

జగ : చూశావుగా? ముసుగు బిగించి పడుకున్నాను. ఆ రాజమండ్రి వెళ్ళి ఆ ముండాకొడుకుని కసితీరేలా తిట్టివద్దామా? అనిపించింది. ఛా! వాడికి ఇంగితం లేకపోతే నాకులేదా? అని తమాయించుకున్నాను. ఇక రేపట్నుంచీ మళ్ళీ సంబంధాలేవో చూడాలి.

నీల : (ఓదార్పుగా) ఏదో చేద్దాంలే. పిల్ల పెళ్ళికాకుండా ఆగిపోతుందా? జీవితం అంటే ఎన్నో ఎదురుదెబ్బలు తగులుతూనే వుంటాయ్. అన్నీ తెలిసినవాడివి నువ్వే ఇలా బెంబేలు పడిపోతే ఇందిర ఎంత బాధపడుతుందో ఆలోచించావా?

జగ : పడుతుంది మరి? ఆడపిల్లకీ— ఆడపిల్ల తండ్రికీ బాధగాక సుఖం వస్తుందా? (ఆవేశంగా) వాళ్ళు చేసిన మోసానికి నా కడుపెలా కుతకుత వుడుకుతోందో నీకు తెలుసా?

నీల : నా కంతా తెలుసులేవయ్యా! ఆవేశపడితే జరిగేదేమీలేదు.

సావి: (దీనంగా) అన్నయ్యా! కాస్త ఇందిర పెళ్ళిమాట నీ దృష్టిలో వుంచుకుందూ! ఎక్కడయినా సంబంధం దొరికితే....

నీల : అలాగేనమ్మా! తప్పకుండా చూస్తాను. ఇందిర ఒకటి నిర్మల ఒకటీనా ! మరి నేను వెళ్తా బావా! నువ్వు లేచి కాస్త రెండు ముద్దలు తిను. దిగులుపడకు. అంతా నే చేస్తాగా!—

* * *

(రాజమండ్రిలో కుటుంబయ్య ఇల్లు)

నీల : కుటుంబయ్యగారున్నారండీ?

కుటుం: ఎవరు వారు? రండి, రండి. కూర్చోండి. కుటుంబయ్యని నేనే లెండి.

నీల : నమస్కారం! తమ దర్శనం చేసుకుపోదామని ....

కుటుం: ఇహిహి! దానికేంలేండి. అలా కూర్చోండి బల్లమీద. మాకుర్రాడి పెళ్ళయ్యాక సోఫాలవీ కొంటాంలెండి.

నీల : (స్వగతం) నీ అమ్మ కడుపుమాడ. కొడుకు పెళ్ళయ్యేదాకా తిండి కూడా తినకు. (గట్టిగా) నేనుకూడా ఆ పనిమీదే వచ్చాలెండి. తమరికో అబ్బాయున్నాడని తెలిసి....

కుటుం: (గర్వంగా) తెలుస్తుంది తెలుస్తుంది. మా అబ్బాయి కబురు ఈ జిల్లా అంతా తెలిసింది.

నీల : (స్వగతం) నీ కొడుకు తప్ప ఈ జిల్లాలో మగవెధవ లేడులే మరి. (గట్టిగా) అబ్బాయికి సంబంధం ఏదన్నా కుదిరిందాండీ?

కుటుం: సంబంధమా? ఎబ్బే! ఈ రోజుల్లో మగపిల్లాడి పెళ్ళంటే ఆషా మాషీ అటండీ! బెల్లానికి చీమలు చేరినట్టు, ఈగలు ముసిరినట్టు—

మగపిల్లాడున్నాడని తెలిస్తే ఎవరో ఒకళ్ళు వచ్చి పోతూనే వుంటారు. ఏమంటారు?

నీల : (స్వగతం) ఓరి నీ కవిత్వం మండా! నేనో ఈగనీ – చీమనీ అయ్యానా? పైగా నన్నే సాక్ష్యం అడుగుతున్నావూ?– (గట్టిగా) ఎంతమాట! ఆడపిల్లల్ని కన్నవాళ్ళం! మా అవసరమేగానీ, పుణ్యం చేసుకుని కొడుకునికన్నారు మీరు—మీ అదృష్టంలెండి ఇంతకీ. అబ్బాయికి సంబంధం కుదరలేదంటారా? మొన్న కాకినాడ వాళ్ళెవరో ఆరు వేలిస్తామన్నారట. మీరు ఒప్పుకున్నారట. అబద్ధమే అంటారా?

కుటుం: చూడండి! ఎవరోవచ్చి కాళ్ళావేళ్ళా పడతారు. కాదనలేక ఏదో అనేసాం. అంతమాత్రాన అది ఖాయమైనట్టేనా? మూడుముళ్ళూ పడేదాకా ఏదీ నికరం కాదు. ఎక్కువ లాభిస్తే వదిలేసుకుంటామటండీ?

నీల : మా బాగా చెప్పారు. అవకాశం వుంది కాబట్టి ఇప్పుడే లాక్కోవాలి. ఆ పెళ్ళికాస్తా అయిపోతే మీ మొహం ఎవరు చూస్తారు లెండి?

కుటుం: ఇంతకీ మీరు వచ్చినపని చెప్పారు కారు.

నీల : ఆడపిల్ల తండ్రిని. ఇంకెందు కొస్తానండీ? మా అమ్మాయి చదువుకుంటోంది. వీణ వాయిస్తుంది తెల్లగా అందంగా వుంటుంది. పేరు నిర్మల.

కుటుం : (విసుగ్గా) నిర్మలయినా, నరసమ్మయినా ఒకటేలెండి. ఆడపిల్ల ఆడపిల్లే. ఇంత వండిపడెయ్యాలి. కాపరం చెయ్యాలి. ఈ భాగ్యానికి వీణ లెందుకండీ వాయించటం? అసలు మీ మాట ఎంతలో వుందో చెప్పారుకాదు.

నీల : అదే చెప్పబోతున్నాను బావగారూ! అమ్మాయిపేర పదివేలు బ్యాంకులో వేశాను చిన్నప్పుడే. వడ్డీతో కలిసి పన్నెండు వేలవుతుంది లెండి.

కుటుం: [ఆశ్చర్యంగా] పన్నెండువేలే! ఏమిటి రూపాయలా? పైసలా?

నీల : ఎంతమాట! రూపాయలే. నాకు ఒక్కతే ఆడపిల్ల. వంటినిండా నగలు చేయించింది వాళ్ళమ్మ.

కుటుం: పిల్ల నగలన్నీ పెట్టుకుంటుందా? నాజూకుతనం నేర్చిందా? నాకలా పనికిరాదు సుమండీ! అన్నీ పెట్టుకుని అత్తారింటికి రావాల్సిందే.

నీల : (స్వగతం) ఎందుకు? నీ అప్పులు తీర్చటానికా? (పైకి) ఇక లాంఛనాలకే కొరత చెయ్యనులెండి. స్కూటర్ కొంటాను. రేడియో కొంటాను. రెండు చేతులకీ వాచీలు కొంటాను.

కుటుం: బాగుంది, బాగుంది. మీ అల్లుడి ముద్దు ముచ్చట్లు మీకు తెలియవటండీ? (భళ్ళున నవ్వు)

నీల : అసలు నా ముచ్చటంతా మిమ్మల్నిచూచే సుమండీ! మీకు టెర్లిన్ పంచెలజత పెట్టాలని నా ముచ్చట. మరి మీ అభిప్రాయం ఏమిటో చెప్తే....

కుటుం: (పొంగిపోతూ) ఇంకా అభిప్రాయం ఏమిటి లెండి. మీరింతగా ప్రాధేయ పడుతోంటే ఎందుకు కాదనాలి? మరో వెయ్యి చేసుకోండి.

నీల : సరే! అలాగే కానివ్వండి. కానీ కాకినాడవారి మాట తేల్చేసి మీరు నాకు ఏ సంగతీ చెప్తేగానీ....

కుటుం: ఇంకెక్కడి కాకినాడవాళ్ళండీ? గంగలో దిగుతారు. నా లాభం నేను పోగొట్టుకుంటానా? ఇవాళే ఉత్తరం రాసి పడేస్తాను.

నీల : మంచిది. అలా చెయ్యండి. తర్వాత మనం లగ్నాలు పెట్టుకుందాం. ఇంకా నాలుగు రోజులు ఈవూళ్ళోనే వుంటాలెండి. ఇన్నీసుపేటలో మా బావమ్మరిదిఇంట్లో మకాం. మళ్ళా కలుస్తాను.

కుటుం: వెళ్ళిరండి. శుభం.

* * *

కుటుం! ఒసేవ్! ఈ కాకినాడవాళ్ళ అఘాయిత్యం చూశావా? నానాతిట్లూ తిడుతూ పదిపేజీల జవాబు రాశాడు పిల్ల తండ్రి.

పార్వ : తిట్లుకూడా తిట్టాడూ?

కుటుం: జాతిలేని వాళ్ళమట. నీతిలేని వాళ్ళమట. అసలీ సంబంధం తప్పి పోయినందుకే సంతోషిస్తున్నాడట. అసలు పోలీసులకి అప్ప జెప్పేవాడేగానీ ఎందుకో వూరుకున్నాడట.

పార్వ : ఆ పోలీసులు తననీ లాక్కుపోతారని తెలుసు. పదమూడువేల కట్నం వస్తూంటే ఎలా మానేసుకొంటాం? అంత మాట మీర కుండా వుండటానికి ఆ పిల్లేం నా అన్న కూతురా? తమ్ముడి కూతురా?

కుటుం: బాగా అన్నావు. మొదట ఏలూరువాళ్ళు మాత్రం నోరుమూసుకు వూరుకోలా? ఈయనేం వూడిపడ్డాడా? ముష్టి ఆరువేలిస్తాడో లేదో పదిపేజీల ఉత్తరం రాశాడు వుత్తరం.

పార్వ : అనవసరంగా అర్ధణా సిరా ఖర్చు చేసుకున్నారు. పోనిద్దురూ! వాళ్ళతో ఏమిటి? మొన్న వచ్చినాయిన ఏమయ్యాడో చూడండి. మంచి సంబంధం, మించిపోయేను.

కుటుం: ఆఁ ఆఁ నేనూ అదే ఆలోచిస్తున్నా. ఇన్నీసుపేటలో వుంటా నన్నాడు. అడ్రసదీ యిచ్చాళ్లే. పిల్లాడి తండ్రిని నేను వెళ్ళటం ఏమిటా అని ఆలోచిస్తున్నా.

పార్వ: డబ్బు వస్తోంటే ఈ సింగినాదాలన్నీ ఏమిటీ? ఆయనేం పనుల్లో వున్నాడో!

కుటుం: సరే! సరే! ఇప్పుడే వెళ్తా-లగ్నం పెట్టుకోటానికి రమ్మని మరీ చెప్పివస్తా.

* * *

(నీలకంఠం బొమ్మరిది ఇల్లు)

నీల : ఎవరూ? కుటుంబయ్యగారా ? రండి, రండి.

కుటుం: ఇంట్లోనే వున్నారే! ఊరెళ్ళిపోయారేమోనని ఆదరా బాదరా వస్తున్నా.

నీల : అబ్బే! ఏవో పనుల్లో మునిగి అశ్రద్ధ చేశానండీ! అన్నట్టు కాకినాడ వారి కబురేం చేశారు?

కుటుం: (ఉత్సాహంగా) ఆనాడే చెప్పాగా? ఉత్తరం ముక్క రాసి పడేశాను. జవాబుకూడా వచ్చింది.

నీల : ఆహా! ఏమని రాశారూ? కట్నం ఎక్కువ చేస్తామన్నారుగా?

కుటుం: వాళ్ళ మొహం! ఉక్రోషంతో నానా చెత్తా రాశారు. రాసుకోనివ్వండి. ఏనుగు దారిన పోతుంటే — ఏవో మొరుగుతాయంటారే. ఏమంటారు?

నీల : అంతే! అంతే!

కుటుం: ఇంతకీ మనం లగ్నం ఎప్పుడు పెట్టుకుందాం? మా ఆడది కోడల్ని తెచ్చుకోవాలని తెగ ముచ్చట పడుతోందంటే నమ్మండి.

నీల : కుటుంబయ్యగారూ ! మీకో మాట చెప్పాలండీ!

కుటుం: చిత్తం. సెలవియ్యండి.

నీల : మరేంలేదు. ఆ రోజు మీ సంబంధం మాటాడుకుని ఇంటికి వచ్చానా? మర్నాడే మా బొమ్మరిది ఒక సంబంధం తీసుకొచ్చాడు.

కుటుం: (గాభరాగా) ఎవరికి? మీ అమ్మాయికే?

నీల : మా నిర్మలకే లెండి. అమ్మాయికూడా నాతోటే వచ్చింది ఏలూరు నుంచి. మీకు చూపిద్దామా అనుకుంటే యింతలో వాళ్ళ మేనమామ సంబంధం తెచ్చాడు. కుర్రాడు యం. ఏ. పాసయ్యాడు. లెక్చె

రర్‌గా పనిచేస్తున్నాడు. మంచి రంగూ, ఎత్తూ—పొడుగూ — నిండైన విగ్రహం కుర్రాడు మా నిర్మలని చూచి చాలా యిష్టపడ్డాడు సుమండీ! అమ్మాయి వీణ వాయిస్తోంటే తెగ మురిసి పోయాడనుకోండి. వెధవడబ్బుతో ఏముంది జీవితమంతా బ్రతికే మనిషితో వుందిగానీ. ఆవటా అనీ కానీ కట్నం లేకుండా పిల్లని చేసుకుంటా నన్నాడండీ !

కుటుం: (అదిరిపడి) కట్నం లేకుండానే! పెళ్ళి చేసుకోవటమే!

నీల : కట్నమే కాదు. లాంఛనాలు కూడా అక్కర్లేదన్నాడండీ! పెళ్ళి సింపుల్‌గా చేయిస్తే చాలన్నాడండీ!

కుటుం: (తేరుకుంటూ) అన్నట్టు మీకు ఒక్కతేగా పిల్ల. కట్నం తీసుకున్నా మానినా అంతా ఆ పిల్లకేగా? అలా అయితే మా కుర్రాడికే చేసుకుంటాను.

నీల : ఆడిపిల్ల ఒక్కతే అన్నానుగానీ— మొగపిల్లలు లేరన్నానా?

కుటుం: అయితే మీ అమ్మాయికి కట్నం యివ్వకుండా పెళ్ళి చేసేస్తారా?

నీల : ఎవరిలాభం ఎవరు పోగొట్టుకుంటారో మీరే చెప్పండి. ఎక్కువ వచ్చేచోట మీరు చూసుకుంటారు. తక్కువలో అయిపోయేచోట మేం చూసుకుంటాం. ఏమంటారు?

కుటుం: అనటానికేంలే! నన్నింత ఆశపెట్టి తీరా తక్కువలో అయిపోతోందని— మరో సంబంధం చూసుకుంటారా?

నీల : అదేంమాట కుటుంబయ్యగారూ? మీరుమాత్రం పాపం ఏలూరు వాళ్ళని ఆశపెట్టలేదూ? ఎక్కువ వస్తోందని కాకినాడకేసి తిరగలేదూ? మళ్లా ఎక్కువ వస్తోందని వాళ్ళనికూడా ఒదుల్చుకోలేదూ?— అయినా మూడుముళ్ళూ పడకుండా మా సంబంధం ఖాయమైందని ఎలా అనుకున్నారు? అవునంటారా? కాదంటారా? మీరే చెప్పండి?

కుటుం: (నెత్తి బాదుకుంటూ) అవునయ్యా ! అవును. మధ్యలో నన్ను గోతిలోకి దించావుకదయ్యా! పదమూడు వేల కట్నం వస్తుందని మురిసి ముక్కలయ్యాను. నా కొడుకును పెద్దరూపాయల మూటను కున్నాను. ఇప్పుడేం దారిరా దేవుడా?

నీల : అలా బెంబేలు పడిపోకండి. కాకినాడ సంబంధం వుందిగా? ఆరు వేలిస్తారు.

కుటుం: ఇంకెక్కడి కాకినాడయ్యా? చెర్లో కాకినాడ! ఛెడామడా తిడుతూ పదిపేజీల ఉత్తరం రాశాడు!

నీల : పోనీ నన్నేం చెయ్యమంటారు చెప్పండి. మీరు ఏలూరు సంబంధం కుదుర్చుకుని మానేశారా? లేదా? కాకినాడ సంబంధం కుదుర్చుకుని మానేశారా? లేదా? మీ లాభం మీది. అలాగే నా లాభం నాదను కున్నాను. పోనీ ఒకలా చెయ్యండి. కానీ కట్నం లేకుండా మా నిర్మలని మీ అబ్బాయికి చేసుకుంటానంటే అలాగే చేస్తాను.

కుటుం: కానీ కట్నం లేకుండానా? యిదేం తద్దినమయ్యా? నిక్షేపంలా ఆ ఏలూరువాళ్లే మొదట నాలుగువేలిస్తా మన్నారుగా?

నీల : పోనీ అలాగే చెయ్యండి. ఆ జగన్నాధంగారు నాకు తెలుసు. చాలా మంచివారు. మళ్లా ఆ సంబంధం కుదర్చమన్నా కుదురు స్తాను. ఏమంటారు?

కుటుం: ఇంకేమంటాను? నా వల్లకాడు! అన్నీ పోగొట్టుకుంటే కుర్రాడి పెళ్ళిమాటేమిటి? మళ్లా ఆ జగన్నాధంగార్ని ఏ వెధవ మొహం పెట్టుకు చూస్తాను.

నీల : పర్వాలేదు మీ వెధవమొహం పెట్టుకునే చూడొచ్చు. మీరు నా వెనకరండి చాలు! లగ్నం పెట్టించేస్తాను.

కుటుం: ఏదో స్థిరపర్చి ఆ పుణ్యం మీరే కట్టుకోండి.

నీల : అయితే రేపే వెళ్దాం—ఏలూరు.

* * *

(జగన్నాధం యిల్లు)

నీల : బావా! బావా! పెళ్ళివారొచ్చారయ్యా! బయటికిరా.

జగ : ఎవరూ ? నీలకంఠమా ? ఆయనెవరూ ? కుటుంబయ్యగారిలా వున్నారే !

కుటుం: ఇ—హి—హి— నేనేలెండి!

నీల : జరిగిందంతా పూర్తిగా మరిచిపోండి ఇద్దరూ. నిక్షేపంలా బ్రాహ్మణ్ణి పిల్చి లగ్నం పెట్టించుకోండి.

జగ : (ఆశ్చర్యంగా) నాకేం అర్ధం కావటంలేదు. మా సంబంధం వద్దని రాసేశారుగా?

నీల : (మందలింపుగా) అదిగో అవన్నీ అడక్కు. ఆయన బయల్దేరి వచ్చారంటే మళ్లా సంబంధం కోసమేగా?

జగ : కాని ఒక్కమాట వినండి కుటుంబయ్యగారూ! నాలుగువేలకన్నా ఒక్క పైసాకూడా ఇవ్వలేను. తర్వాత నన్ను నిష్ఠూరపెట్టి ప్రయోజనంలేదు.

కుటుం: కట్నం సిగతరిగిరిలే! ఎంతవుంటే అంత యివ్వచ్చు. ముందు లగ్నం పెట్టించండి బావగారూ!

జగ : కూర్చోండి. కూర్చోండి. ఇప్పుడే పురోహితుడికోసం కబురు పంపిస్తాను.

ఇందిర: (తలుపు వెనకనుంచి ధైర్యంగా నలుగురిలోకీ వచ్చి) నాన్నా! లగ్నం అదీ ఏమీవద్దు. నాకీ సంబంధం యిష్టంలేదు.

జగ : అదేమిటమ్మా! వారికై వారేవస్తే—

ఇందిర: (పట్టుదలగా) ఒద్దునాన్నా! నన్నీ డబ్బు మనుషుల కప్పగించకు. పెళ్ళంటే నాకు చాలా పవిత్రమైన అభిప్రాయం వుంది. భర్త

గురించికూడా నాకు చాలా సున్నితమైన కోరికలున్నాయి. మనిషికి ప్రత్యేకత లేక – మనిషి విలువ గుర్తించలేక — లాంఛనాలకే ప్రాముఖ్యతయిచ్చే మనుషులు వీళ్ళు జీవితాలకు శాశ్వతంగా అనురాగంతో బంధించాల్సిన పెళ్ళిని లాభసాటి బేరంలా వర్తకాలు సాగిస్తోన్న వ్యాపారులు వీళ్ళు! ఈ సంబంధం చేసుకొని రేపు జీవితంలో భార్యగా—ఆ యింటి కోడలిగా నేనేం అనుభవిస్తానో – ఎలాంటి స్థానం పొందుతానో ఒక్కసారి ఆలోచించు నాన్నా! జీవితానికి పెళ్ళి అవసరమే కానీ అనివార్యంకాదు. ఇలాంటి పెళ్ళి చేసి నా బ్రతుకు నాశనం చెయ్యకు నాన్నా! నా జీవిత సమస్య కాబట్టి యిలా నలుగురిలోనూ సిగ్గువిడిచి చెప్పక తప్పలేదు.

(ఇందిర కంఠస్వరం కంపించింది దుఃఖంతో)

కుటుం: (ఎవ్వరూ మాట్లాడలేకపోయారు. కుటుంబయ్యకి మాట్లాడక తప్పలేదు. గద్గదస్వరంతో—)

అమ్మా! ఇందిరా! నువ్వు చిన్నదానివేగానీ నా కళ్ళు తెరిపించావమ్మా! నీ మాటలతో నా మనస్సులో మాలిన్యమంతా కరిగిపోయింది– కానీ ఒక్కమాట వినుతల్లీ! నిజం చెప్తున్నాను. పెళ్ళిచూపుల్లో నిన్నుచూసి మావాడు చాలా సంతోషపడ్డాడు. కట్నం యివ్వకపోయినా సరే మీ సంబంధం కుదర్చమన్నాడు. నాకే ప్రాణం ఒప్పక పెనుగులాడాను. తర్వాత కాకినాడ వాళ్ళొస్తే ఆ దుర్బుద్ధీ నాకే పుట్టింది. ఇలా సంబంధం మార్చిన సంగతి ఇప్పటికికూడా వాడికి తెలీదు. లగ్నాలు పెట్టేసుకున్నాక చెప్తే కట్నం ఎక్కువ వస్తోంది, కాబట్టి వాడే నోరు మూసుకుంటాడని ఈ తంతంతా నేనే నడిపాను. దేవుడే కళ్ళు తెరిపించాడో ఏమో!

అంతా అభాసవకుండా యిలా గట్టెక్కాను. ఇక నీ మనస్సులో ఏమీ వుంచుకోకమ్మా! నీలాంటి కోడలు నా యింట్లో తిరిగితే చాలు. నువ్వు కాదంటే మావాడికి మొహం చూపించలేను. జరిగిందేమీ మనస్సులో పెట్టుకోకమ్మా !

ఇందిర: (సిగ్గుతో) అంతా మీ యిష్టం నాన్నా !

* * *

(పెళ్ళిబాజాలు, పందిట్లో పెళ్ళవుతూ వుంది)

నీల : ఏవోయ్! పెళ్ళికొడుకా! ఎందుకైనా మంచిది. ఆరుముళ్లు వెయ్యి. మీ నాన్నని నమ్మలేం.

పెళ్ళికొడుకు : మా నాన్నంటే నాకూ భయమే! అందుకే మూడుమూళ్ళు తొమ్మిది ముళ్ళు వేశానండీ !

(నవ్వులు)

(రేడియో ప్రసారితము, 1966)

—(౦)—